క్లుప్తంగా

బాబా సింహాసనానికి రూ.2 లక్షలు విరాళం



రసీదు అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని కూనవరం రోడ్డు ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లోని సాయిబాబా మందిరానికి ఓ భక్తుడు శుక్రవారం భారీ విరాళం అందించాడు. పట్టణానికి చెందిన పద్మ క్లాత్ స్టోర్స్ వారి ఆధ్వర్యంలో దివంగత గొండేల రత్నకుమారి- వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం వారి మనుమడు, కోడలు శ్రీసాయిబాబా వారికి చేయించనున్న స్వర్ణ సింహాసనానికి రూ.2 లక్షలు విరాళం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు బాబావారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయ కమిటీ వారు స్వామివారి జ్ఞాపికతో పాటు ప్రసాదం అందజేశారు. ఆలయ అధ్యక్షుడు తుమ్మలపల్లి సత్యనారాయణమూర్తి, కోశాధికారి కుంచాల రమేష్, మందరపు నాగరాజు పాల్గొన్నారు.

ఇరువురు ఈఓల మధ్య రాజీ..?

భద్రాచలంఅర్బన్: ఈ నెల 29న రామాలయం పరిసర ప్రాంతాల పారిశుద్ధ్య పనుల బాధ్యతలు ఆలయానిదేనని భద్రాచలం పంచాయతీ ఈఓ శ్రీనివాసరావు రామాలయం ఈఓ రమాదేవికి ఓ లేఖను విడుదల చేశారు. తూర్పు, దక్షిణ, పడమర, ఉత్తర మాఢ వీధులు, విస్తా కాంప్లెక్స్, అన్నదానం, ప్రసాదాల వంటశాల ప్రదేశాల్లో నిర్వహించాల్సిన పారిశుద్ధ్య పనులు ఆలయ సిబ్బందితో తొలగించుకోవాలని లేఖలో పంచాయతీ ఈఓ ప్రస్తావించారు. రెండు రోజులుగా భద్రాచలంలో ఇదే విషయం చర్చనీయాంశంగా మారింది. ఈ మేరకు భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ శుక్రవారం గ్రామ పంచాయతీ ఈవో శ్రీనివాసరావు, రామాలయం ఈవో రమాదేవి మధ్య సయోధ్య కుదిర్చినట్టుగా సమాచారం. రామాలయం పరిసర ప్రాంతాల్లో పంచాయతీ సిబ్బంది మాత్రమే పారిశుద్ధ్య పనులు చేయాలని ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ నిర్ణయం తీసుకున్నట్లుగా సమాచారం. కాగా ఈ విషయానికి సంబంధించిన సమాచారం అధికారికంగా తెలియాల్సి ఉంది.

విద్యార్థిని మృతిపై విచారణ చేపట్టాలి

భద్రాచలంటౌన్: బీఎస్సీ నర్సింగ్ విద్యార్థిని పగిడిపల్లి కారుణ్య అనుమానాస్పద మృతిపై న్యాయ విచారణ జరిపించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి మస్తాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా ఉండాలంటే తప్పు చేసినవారు ఎంతటి వారైనా వారిని గుర్తించి కఠినంగా శిక్షించి ఆ నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. ఇప్పటికైనా కారుణ్య మృతిపై ప్రభుత్వం స్పందించి పూర్తి స్థాయి విచారణ జరిపించి ఆ కుటుంబానికి న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఏరియా ఉత్తమ ఉద్యోగుల ఎంపిక



రామదాసు



మనాది కృష్ణ

మణుగూరు టౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో విధులు నిర్వర్తిస్తూ పనిలో ఎంతో నిబద్ధతతో వృత్తి నైపుణ్యత చూపుతూ అంకితభావంతో పనిచేస్తున్న వారిని ఉత్తమ ఉద్యోగులుగా, అధికారులుగా ఎంపిక చేసినట్లు ఏరియా అధికార ప్రతినిధి సలగల రమేశ్ శుక్రవారం తెలిపారు. అత్యుత్తమ ఉద్యోగిగా అమర్లపూడి రామదాసు డీవైఎస్ఈ(ఈఅండ్ఎం) పీకేఓసీ, ఉత్తమ ఉద్యోగిగా మనాది కృష్ణ, హెడ్ ఓవర్‌మెన్, మణుగూరు ఓసీలను ఎంపిక చేయగా, వారిని ఆదివారం భద్రాద్రి స్టేడియంలో జరిగే ఆవిర్భావ వేడుకల్లో ఏరియా జీఎం దుర్గం రాంచందర్ చేతులమీదుగా సన్మానించనున్నట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

అశ్వారావుపేటరూరల్: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను శుక్రవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై శ్రీరాముల శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పండువారిగూడెం వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమతులు లేకుండా అనంతారం గ్రామంలోని వాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేశారు. పట్టుబడిన ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, అచ్చి రామకృష్ణ, గుంజి రమణలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దమ్మపేట: మండలంలోని మందలపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఇసుక ట్రాక్టర్ తనిఖీ చేసి ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేశారు. ఏఎస్సై ప్రతాప్‌రెడ్డి కథనం ప్రకారం.. రెడ్యాలపాడు గ్రామ శివారులోని మల్లెపూలవాగు నుంచి ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

తీరని సొంతింటి కల..!

'డబుల్' ఇళ్లు ఉన్నా.. లేనట్టే..

- లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు
- ఆరేళ్లు గడుస్తున్నా పూర్తికాని నిర్మాణాలు
- అందుబాటులోకి రాని ఇళ్లు



అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు



ములకలపల్లి: తాళ్లపాయ వాసుల సొంతింటి కల గడుస్తున్నా తీరడంలేదు. లబ్ధిదారులకు కేటాయించినా డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తికాకపోవడంతో, ఇవి ఉన్నా.. లేనట్లుగానే మారింది. మండల పరిధిలోని తాళ్లపాయలో 20 డబుల్‌బెడ్ ఇళ్ల నిర్మాణానికి సుమారు ఆరేళ్ల క్రితం పనులు మొదలుపెట్టారు. పనులు ఆరంభించి, చేతులుదులుపుకున్న అధికారులు వాటిని పూర్తిచేసే దిశగా చొరవ చూపక పోవడం విమర్శలకు తావిస్తోంది.

గతంలోనే హెచ్చరించినా ...

నిర్మాణదశలో ఉన్న తరుణంలో 20 ఇళ్లకు సంబంధించి రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించారు. గ్రామస్తుల సమక్షంలో ఇరవై మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. నిర్మాణాలు పూర్తయితే ఇళ్ల కేటాయింపు మాత్రమే మిగిలింది. దీంతో తమ సొంతింటి కల నేరవేరిందని ఆశపడ్డ గిరిజనులకు నిరాశే ఎదురైంది. ఎన్నాళ్లకీ నిర్మాణాలు ముందుకు సాగకపోవడంతో స్థానికుల ఫిర్యాదుతో సుమారు ఏడాది క్రితం అప్పటి ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు గ్రామాన్ని సందర్శించారు. నత్తనడకన సాగుతున్న పనులు, అసంపూర్తి నిర్మాణాలను చూసి అసహనం వ్యక్తం చేశారు. సగం ఇళ్లకు కనీసం స్లాబ్‌లు కూడా వేయకపోవడంపట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పనులన్నీ పూర్తిచేయాలని అధికారుల ఆదేశించారు. అయినా నేటికీ ఇళ్లు అందుబాటులోకి రాలేదు. ఎలక్ట్రికల్ వైరింగ్, ఫ్లోరింగ్, వాటర్ పైపులైనుతోపాటు బాత్రూం డోర్లు, తలుపులు, కిటికీలకు డోర్లు వంటి ఫినిషింగ్ పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. దీంతో లబ్ధిదారులు ఇళ్లలోకి వెళ్లే వీలులేకుండా పోయింది.

బిక్కుబిక్కుమంటూ..

కళ్లముందే ఇళ్లున్నా, అవి అందుబాటులోకి రాకపోవడంతో లబ్ధిదారులు బిక్కుబిక్కుమంటూ పూరిళ్లలోనే జీవనం సాగిస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి పూరిళ్లలో నానా అవస్థలు పడ్డారు. అర్ధరాత్రి వేళ ఏం చేయాలో తోచక, గత్యంతరంలేని పరిస్థితుల్లో సమీపస్తులు ఇళ్లలో తలదాచుకున్నారు. డబుల్ ఇళ్లు పూర్తయితే తమ తిప్పలు తప్పుతాయని దీనంగా చెబుతున్నారు. అధికారులు ఇప్పటికైనా చొరవ చూపాలని, తమకు కేటాయించిన ఇళ్ల పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలని కోరుతున్నారు.

ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం



ఇళ్లు మొదలుపెట్టి ఆరేళ్లు అవుతున్నా, ఇంకా పూర్తికావడంలేదు. సొంతిల్లు వస్తుందని ఆశగా చూస్తున్నాం, ఎప్పటికి పూర్తవుతాయో అర్థం కావట్లేదు. గాలిదుమ్ము, వానలకు ఇబ్బందులు పడుతున్నాం. – ఒగ్గెల రేఖ, తాళ్లపాయ

ఇకనైనా పూర్తి చేయాలి



సంవత్సరాల కాలం గడుస్తున్నా, ఇళ్లు పూర్తికావట్లేదు. సొంతింట్లోకి ఎప్పుడు వెళతామో ఏమో అని అర్థం కావట్లేదు. ఈ వర్షాకాలంలో అయినా పనులన్నీ పూర్తి చేయాలి. – కీసరి సుజాత, తాళ్లపాయ

వారం రోజుల్లో అందుబాటులోకి



అనివార్య కారణాల వల్ల పనుల్లో జాప్యం జరిగింది. ఇళ్లు పూర్తి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించాం. వారం రోజుల్లోగా ఇళ్లను అందుబాటులోకి తీసుకొస్తాం. – సుబ్బరాజు, ఏఈ, ఐటీడీఏ

రాష్ట్ర సాధనలో సీపీఐ పాత్ర వెలకట్టలేనిది



మాట్లాడుతున్న అయోధ్య, నాయకులు

మణుగూరు టౌన్: తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో సీపీఐ, అనుబంధ సంఘాల పాత్ర వెలకట్టలేనిదని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయోధ్య అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ కోసం సీపీఐ తన స్థాయిలో అప్పటి ప్రభుత్వం నిర్విరామ కృషి చేసిందని ప్రభుత్వానికి హెచ్చరికలు, అమరణ దీక్షలు, వంటా వార్పు వంటి కార్యక్రమాల్లో పాల్గొని సీపీఐ తన భూమిక పోషించిందన్నారు. ఇందులో ప్రజా సంఘాలు, సీపీఐ అనుబంధ సంఘాలు ప్రత్యక్షంగా పాల్గొన్నాయన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల పక్షాన ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేసినప్పటికీ ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తే ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు సీపీఐ సిద్ధంగా ఉందన్నారు. ఉద్యమ కారుల సరైన గుర్తింపు కోసం సీపీఐ పార్టీ సీఎం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. నాయకులు సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీకుమారి, జంగం మోహన్‌రావు, దుర్గ్యాల సుధాకర్, ఆర్.లక్ష్మీనారాయణ, ఎస్కే సర్వర్, కుటుంబ రావు, ఏదారి రమేష్, సీతారాములు, భిక్షం, గడ్డం వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ పాయం లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

వృద్ధాశ్రమంలో బియ్యం పంపిణీ



బియ్యం, పండ్లు పంపిణీ చేస్తున్న దాతలు

మణుగూరు రూరల్ : ఇఫ్టూ మణుగూరు ఏరియా అధ్యక్షుడు అంగోత్ మంగీలాల్ అనసూర్య కుమారుడు టాటా లాల్ జన్మదిన సందర్భంగా అశ్వాపురం మండలంలోని ఆరీఫా అండ్ రోష్నీ వృద్ధాశ్రమానికి 25కేజీల బియ్యం, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకులు, వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటిపై తప్పుడు ప్రచారం తగదు

భద్రాచలంటౌన్: సమస్యల పరిష్కారానికి ఎప్పుడు ప్రజలతో ఉండే వ్యక్తి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అని, ఎన్నికలప్పుడే రాజకీయాలు చేసే వ్యక్తి అంటూ తప్పుడు ప్రచారం చేయడం తగదని భద్రాద్రి ప్రాంత పరిరక్షణ సమితి అధ్యక్షుడు మాజీ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యులు డా.బూసిరెడ్డి శంకర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ... మొదటిసారి రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పొంగులేటి శ్రీనివాసరెడ్డికి చక్కబెట్టుకునే సమయం కూడా ఇవ్వకుండా కులం పేరుతో బురద చల్లటం బాధాకరమన్నారు. సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలను మూడేళ్లలోపే ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అర్హులైన ప్రతీ ఒక్కరికీ అందించే పనిలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి నిమగ్నమై ఉన్నారన్నారు. నిజమైన కాంగ్రెస్ నాయకులయితే ఇటువంటి బురద చెల్లే రాజకీయాలను చేయొద్దని విజ్ఞప్తి చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

అశ్వాపురం: మణుగూరు భారజల కర్మాగారం ఉద్యోగ సంఘం అధ్యక్షుడు, టీఎన్‌టీయూసీ నాయకుడు కూరపాటి శ్రీనివాసరావు తల్లి సావిత్రమ్మ అనారోగ్యంతో మృతి చెందగా సావిత్రమ్మ మృతదేహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో డీసీసీబీ డైరెక్టర్, కాంగ్రెస్ నాయకుడు తుళ్లూరి బ్రహ్మయ్య, టీఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు పోటు రంగారావు, హరిప్రసాద్ ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

భద్రాద్రిలో అంజన్న ఇరుముడి



భజన చేస్తున్న హనుమాన్ భక్తులు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని పవిత్ర గోదావరి తీరంలోని ఆంజనేయ స్వామివారి ఆలయంలో శుక్రవారం అంజనేయ మాలధారులు హనుమాన్ జయంతి పురస్కరించుకొని ఇరుముడి కట్టుకుని కొండగట్టుకు బయలుదేరారు. రామయ్య దర్శనానికి భద్రాద్రి వచ్చే భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి అక్కడే ఉన్న అంజన్నకు పూజలు చేసి రామాలయానికి చేరుకుని సీతారామచంద్ర స్వామివార్లను దర్శించుకుంటారు. ప్రతీ ఏటా హనుమాన్ జయంతి ముందు మాలధారణ చేసిన భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరుముడి కట్టుకున్నారు.

గుట్కా విక్రయాల నిషేధంపై హర్షం

దుమ్ముగూడెం: తెలంగాణా రాష్ట్రంలో గుట్కా, పాన్ మసాలాల విక్రయంపై ప్రభుత్వం నిషేధం విధించడంపై కాంగ్రెస్ జిల్లా సోషల్ మీడియా మాజీ చైర్మన్ కనుబుద్ది దేవా అన్నారు. ఈ మేరకు శుక్రవారం మాట్లాడుతూ.. గుట్కాలు, పాన్ మసాలాలపై ప్రభుత్వం దీనిపై నిషేధం విధించడానికి ఉత్వర్వులు విడుదల చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు.

భానుడి భగభగలు..

- అల్లాడుతున్న ప్రజలు
- పెరిగిన విద్యుత్ వాడకంతో సరఫరాలో అంతరాయం



జన సంచారం లేక నిర్మానుష్యంగా మారిన చర్లలోని ప్రధాన రహదారి

చర్ల: భానుడి ప్రతాపం మళ్లీ తీవ్రమైంది. పది రోజుల క్రితం తేలికపాటి జల్లులు పడడంతో పాటు మబ్బులు కమ్మి కాస్తా వాతావరణం చల్లబడగా ప్రజలు కాస్తా ఉపశమనం పొందారు. తర్వాత మళ్లీ తిరిగి వారం రోజుల నుంచి ఎండ తీవ్రత అధికమయ్యింది. ఎండలు దంచి కొడుతుండడంతో ఎండ తీవ్రత వల్ల జనం అల్లాడుతున్నారు. రోహిణీ కార్తె ప్రభావంతో ఎండలు తీవ్రంగా ఉంటున్నాయని, రోహిణీ కార్తె వెళ్లేంత వరకు పరిస్థితి ఇలాగే ఉంటుందని చెబుతున్నారు. ఎండల తీవ్రత నుంచి జనం ఉపశమనం పొందేందుకు శీతల పానీయాలు, ఐస్‌క్రీంలు, కూల్‌డ్రింక్‌లను ఆశ్రయిస్తున్నారు. రేకుల ఇళ్లు, స్లాబు ఇళ్లల్లో ఎండ తీవ్రత మరింతగా ఉండడంతో జనం సమీపాల్లో ఉంటున్న చెట్ల కింద ఎండతీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు సేద దీరుతున్నారు. ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత అధికమవ్వడంతో జనం వీధుల్లోకి రావడం లేదు. దీంతో మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్నీ గ్రామాల్లోని రహదార్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. ఎంతతీవ్రత నేపథ్యంలో ఇళ్లల్లో కూలర్లు, ఏసీల వాడకం కూడా భారీగా పెరగగా విద్యుత్ వాడకం పెరిగి తరుచూ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు కలుగుతున్నాయి. అధిక లోడ్ వల్ల తరుచూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజ్ వైర్లు కాలిపోవడం, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో నుంచి మంటలు రావడం వంటి ఘటనలు కూడా చోటు చేసుకుంటున్నాయి.

నకిలీ విత్తనాల బారిన పడొద్దు..

- విత్తన దుకాణాల్లో అధికారుల తనిఖీ



భద్రాచలంటౌన్: విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు



చంద్రుగొండలో..

భద్రాచలంటౌన్: వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు ప్రతీ రైతు పాటించి నకిలీ విత్తల బారిన పడకుండా ఉండాలని ఏడీఏ సుధాకర్‌రావు, సీఐ సంజీవరావు అన్నారు. పట్టణంలోని విత్తన దుకాణాల్లో వ్యవసాయ, పోలీస్ శాఖలు సంయుక్తంగా శుక్రవారం తనిఖీలు నిర్వహించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రైతులు విత్తనాలను లైసెన్స్ ఉన్న దుకాణంలోనే కొనుగోలు చేయాలన్నారు. మంచి కంపెనీతో పాటు నాణ్యమైన విత్తనాలను తయారీ చేసిన తేదిని చూసి కొనుగోలు చేసి బిల్‌ను తీసుకోవాలని తెలిపారు. వ్యాపారులు సైతం నకిలీ విత్తనాలు, గుడ్డ సంచుల్లో బిల్ లేకుండా విత్తనాలు విక్రయిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ అనిల్‌కుమార్ వ్యవసాయ, పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రుగొండ : మండలకేంద్రంలోని విత్తనాల దుకాణాల్లో కొత్తగూడెంకు చెందిన టాస్క్‌ఫోర్స్, మండల వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. విత్తనాల కంపెనీలు, మేలైన రకాలను పరిశీలించారు. రికార్డులను పరిశీలించారు. ఈ తనిఖీల్లో టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ రాజ్‌కుమార్, మండల వ్యవసాయ శాఖాధికారి వినయ్ పాల్గొన్నారు.

అక్రమ ఇసుక రీచ్‌లకు కందకాలు



సారపాకకు సమీపంలో గోదావరి ఇసుక రీచ్‌కు కందకాలు తవ్విస్తున్న తహసీల్దార్ ముజాహిద్

బూర్గంపాడు: మండలంలోని గోదావరి, కిన్నెరసాని నదుల నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న దారుల్లో శుక్రవారం తహసీల్దార్ ముజాహిద్ కందకాలు తవ్వించారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ఇసుక రీచ్‌ల రహదారులుగా లోతుగా కందకాలు తవ్వించినట్లు తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బూర్గంపాడు, నాగినేనిప్రోలు, సారపాక, తాళ్లగొమ్మూరు, మోతె, ఇరవెండి, పినపాక పట్టీనగర్, ఉప్పుసాక, సోంపల్లి గ్రామాలకు సమీపంలో ఇసుక అక్రమ రవాణా దారులకు కందకాలు తవ్వించారు.

క్యాంటీన్ సౌకర్యం కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మణుగూరు రూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని కొండాపురం భూగర్భగనిలో సెకండ్ షిఫ్ట్‌లో కార్మికులకు క్యాంటీన్ సౌకర్యం కల్పించాలని టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఏరియా ఇన్‌చార్జ్ జీఎం టి.లక్ష్మీపతిగౌడ్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ బ్రాంచ్ కమిటీ ఇన్‌చార్జ్ నాగెల్లి మాట్లాడుతూ.. ఐదున్నర ఏళ్లుగా గనిలో మొదటి షిఫ్ట్‌లో మాత్రమే క్యాంటీన్‌లో అల్పాహార సేవలు అందుతున్నాయన్నారు. క్యాంటీన్ సేవలకు ప్రస్తుతం ఒక సింగరేణి, ఒక ప్రైవేట్ కార్మికుడు పని చేస్తున్నారని, ఇద్దరు సింగరేణి కార్మికులకు విధులు కేటాయించే విషయంపై యాజమాన్యం పునరాలోచన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిబిజికెఎస్ నాయకులు బంగారి పవన్‌కుమార్, మునిగెల నాగేశ్వరరావు, ఎర్రవు వినయ్‌కుమార్, దాసుమల్ల ప్రవీణ్‌కుమార్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ ఉద్యోగికి సన్మానం



వెంకటేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న ఆర్డీఓ దామోదరావు తదితరులు



మణుగూరురూరల్: సీహెచ్ఓను సన్మానిస్తున్న అడిషనల్ డీఎంహెచ్ఓ తదితరులు

భద్రాచలంటౌన్/అశ్వాపురం: భద్రాచలం డివిజన్ సివిల్ సప్లయీస్ శాఖలో డీటీగా విధులు నిర్వహించి వెంకటేశ్వరరావు శుక్రవారం పదవీ విరమణ పొందారు. పట్టణంలోని కేకే ఫంక్షన్‌హాల్‌లో జరిగిన పదవీవిరమణ కార్యక్రమంలో పలువురు అధికారులు వెంకటేశ్వరరావు దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భద్రాచలం ఆర్డీఓ దామోదరావు మాట్లాడుతూ... ఏజెన్సీ గ్రామాలలో ప్రతి నిరుపేదకు రేషన్ అందే విధంగా వెంకటేశ్వరరావు కృషి చేశాడని కొనియాడారు.

సీహెచ్ఓకు ..

మణుగూరు రూరల్ : మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురం గ్రామంలో గల మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్‌ఆఫీసర్‌గా పని చేస్తున్న పదవీ విరమణ పొందిన సీహెచ్ఓ బొమ్మగాని వెంకటేశ్వరరావు దంపతులను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కర్ నాయక్, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్, వైద్యులు సిబ్బంది శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నిశాంత్, డాక్టర్ స్పందన,డాక్టర్ బాలాజీ, డాక్టర్ సుభాష్, నేత్ర వైద్యాధికారి సంజీవరావు, వైద్యులు, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ



చంద్రుగొండ : పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది



చర్ల రూరల్: రేగుంటలో..

చంద్రుగొండ : మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. పొగాకు వాడమని, బంధువులు, స్నేహితులు, ఇతరులు పొగాకు వాడకుండా వారిని సైతం అవగాహన కల్పిస్తామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు కనకం తనుజ, ప్రవీణ్, సిబ్బంది లక్ష్మి, రమ్యశ్రీ, ఎండీ ఇమాం, పద్మ, శ్రీనివాస్, జ్యోతి, అక్కులయ్య తదితరులు పాల్గొన్నారు.

చర్ల రూరల్: మండలంలోని సత్యనారాయణరంలో పీహెచ్‌సీ వైద్యురాలు దివ్యనయన ఆధ్వర్యంలో, కొయ్యూరు పీహెచ్‌సీ వైద్యులు శ్రీధర్ ఆధ్వర్యంలో రేగుంట గ్రామంలో ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవాన్ని నిర్వహించారు. పొగాకు వినియోగించనీయకుండా చూడాలని ప్రతిజ్ఞ చేయించారు. డాక్టర్ పూజ, రామలక్ష్మి, వేణుగోపాల కృష్ణ, రాంప్రసాద్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.